ప్రవేశించివుంటే ఇండియా భవిష్యత్ మరోరకంగా వుండేదేమోనని నేననుకుంటూ వుంటాను. బైదిబై ఆవిడంటే మా వారికి చెడ్డ భయం... టెరిబుల్ లేడీ అంటారు. నాకావిడ మంచిదే - ఎందుకంటే వెండిపళ్ళెంలో ఆవిడ మిగిల్చిన పకోడీలు నాకే పెట్టేది. మన ఆడవాళ్ళలో తల్చుకుంటే ఎంతెంత లేసి మహాపురుషులయినా వున్నారు.

# అమృతం కురవనిరాత్రి

ప్రతికొంపా ఒక ఇండియన్ నేషనల్ కాంగ్రెస్సనుకుంటే ప్రతి ఇంట్లోనూ క్రమశిక్షణలేని ఒక ఇందిరాగాంధీ క్రమశిక్షణ కోసం గంతులు పెట్టే ఒక నిజలింగప్ప వుంటారుంటారు. ఇంటికో గాంధీ దొరకటం కష్టంగానీ, ఇంటింటికో ఇందిరాగాంధీ సులువుగా దొరుకుతుంది. ఇందిరాగాంధి ముక్కు అది కాస్త పొడుగ్గావున్న అమ్మళ్ళందరూ బ్యూటిఫుల్సు కింద లెక్కవుతున్నారు. మూతి ఎన్ని వంకర్లు తిప్పినా ముక్కు చక్కగా వుంటే సరిపోతుంది. శూర్పణఖకు ముక్కూ చెవులూ కోయబట్టికదా స్టోరీ సీతాపహరణం వరకు వెళ్ళి రాజకీయాలు రామరావణ యుద్ధంతో అంతమైంది. దీని కసలు రహస్యమేమిటంటే ఆడదాన్ని అవమానింపకూడదు. అది ముక్కు చెవులవద్ద ఆగకుండా యింకా పైకి క్రిందికి వెళుతుంది. గురువుగారన్నట్లు అప్పుడిహ మరి ఇంజన్ ఆగదు. ఆడది రెచ్చిపోతే శక్తి స్వరూపమయిపోతుంది. మహిషాసురమర్దనం జరిగిపోవల్సిందే - అప్పుడిహ క్రమశిక్షణా! క్రమశిక్షణా అంటూ రూల్సు వల్లించి లాభంలేదు.

అసలాడాళ్ళముందు "రూల్సు" "మేనర్స్" ఏకరువు పెట్టిన వారందరూ ఏమయ్యారు? అరిస్టాటిల్ అలెగ్జాండర్ మనసు మళ్ళించకలిగాడా? తార బృహస్పతిని పల్టీ గొట్టించి చంద్రుడ్ని చేరుకోలేదా? మీరాబాయిని ఆమె భర్త ఏం చేయగలిగాడు? మాట మళ్ళించేవాడేకాని ఆడదాని మనసు (లెఫ్టొరైటో) మళ్ళించకలవారేరి?

ఈ కారణంచేత పెళ్లాన్ని ముక్క ముక్కలుగా నరికి కారంప్పిండి పలుకు తినకపోయినా అప్పుడప్పుడు అందరు మగాళ్లూ సోకాల్డు ఆడదానిమీద కసి తీర్చుకుంటూ వుంటారు. దాంపత్యంలో (పొలిటికలైనా సరే) "కసి" అనే రెండక్షరాల మాటమీద తీరుబడిగా రిసెర్చి చేయొచ్చు.ఎవరయినా వంటింటి చెరసాలలో పడి కొట్టుకుని రంగులు వెలిసిపోయిన రామచిలుక్కి బయట రెక్కలు ముక్కలు చేసుకుని బనీను చింపుకునే బలరాముడికి పొసగదొక్క క్షణం. ఒకరు మరొకరికి చెప్పరాని కసి ఏర్పడ్డంలో రవ్వంతయినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు. వాళ్లని బాగుచేద్దామనుకుంటే ఫలితం రవంతయినా వుండదు. (ఆపు... ఆపు... ఆవాలు కాదు టేక్కేర్.)

మొగుడూ పెళ్లాల దెబ్బలాటలకు ఎంటర్‌టైన్ మెంట్ టాక్స్ లేనట్లే పోలీసు కేసులు కూడా లేవు. పెళ్లాం కరిచిందనుకోండి దానిమ్మగింజల్లా సూదుల్లాటి పళ్ళతో.... అంతకంటె కొంచెం సౌమ్యురాలు వేడిపులుసు వుడికీ వుడకని గుమ్మడికాయ ముక్కల్తోసహా చేతిమీద ఒంపేసిందనుకోండి – పాపం మీరేం చేయగ(లు. ఫో బయటికి ఫో రాస్కెల్ అని కోప్పడగ(లు. మళ్లీ మీకోసెకండ్ థాటొచ్చి పడుతుంది. బయట సొసైటీ దెబ్బతినే ప్రమాదముంది. అంచేత మీరే బయటికిపోతారు – సేఫ్... సేఫర్... సేఫెస్ట్...! చీకటి పడేదాకా మీ పార్టీ వేరు... ఆవిడ పార్టీ వేరు. ఎలక్షన్లలో సిగ్గూ బిడియాలు, సిద్ధాంతాలు విడిచి అంతా కలిసిపోయినట్లు పందిరిమంచంమీద పవ్వళింపుసేవలు తప్పవు. అలగట మెంతసేపు – మళ్ళీ ఆమె కలవటమెంతసేపు. “సరసము విరసము కొరకే. పరిపూర్ణసుఖమ్ము లధిక బాధలకొరకే, పెరుగుట విరుగుట కొరకే” – దట్సాల్! ఆపైన మనకు రాదు.

పొద్దున్నే లేచి టూత్‌పేస్ట్ చప్పరిస్తూ – మీరజాలగలడా! నా యానతి అని పాడుకొంటుంది బాత్రూంలో. “పోబాల పోబాల పొమ్మికన్” అంటూ విడిచి పెడతాడామెను ఆ మంచం మహారాజు ....ఆలోచించు కుంటే ఎ వెరి వెరిబ్యాడ్ డే ఎస్టరడే (నిన్న మహా దుర్దినము) అనిపిస్తుందతనికి. ఇద్దరూ ఒక ప్లేటులో చెరో ఇడ్లీ కాకుండా.... ఒకే యిడ్లీచెరోముక్క కొరుక్కుతింటారు. ఒక గ్లాసులో కాఫీ ఒకచుక్క ఆవిడ, ఒకచుక్క అతనూ తాగుతారు. తలకు నూనె రాస్తుంది. (తన కోసం తెప్పించుకున్న హేరాయిల్) వీపు తోమి నీళ్లు పోస్తుంది. నీకు నేనిలాటి పనిచేయలేనే అని పులుసు పడిన చేత్తో ఆమె చెంపలను నిమురుతాడు. అక్కర్లేదులెండి అని పెళ్ళికూతురిలా సిగ్గుపడిపోయి “క్షణంలో వస్తాను” అని బాత్రూంలో దూరుతుంది. బాత్రూంలోంచి పారేసబ్బు నురగకేసి చూస్తూ ఈవాళ సెలవు పెట్టనా అనుకుంటాడు. ఇంతలో పాతచీరో, తువ్వాలో చుట్టుకొనివచ్చి “ఈ చీర కట్టుకోనా” అని అడుగుతుందామె. ఆహా! ఏమి ఈ శాండల్ పరిమళము... నువ్వు కట్టుకున్నా కట్టుకోకపోయినా బానేవుంటావు సుమా అంటాడతను... అలా కళ్ళు మూసుకోండి అని పురమాయించి అక్కడే గోడకేసి తిరిగి చీరకట్టుకుంటుందామె.

“ఆహా! ఏమి ఆ గోడకున్న అదృష్టము” అని మర్చిపోయి కళ్లు తెరుస్తాడు. లేచిపోండి ఇక్కడ్నుంచి అని ఆమె క్విట్ ఇండియా అని గాంధీగారన్నట్లు చేత్తో గెటవుట్ సూచన చేస్తుంది. లేనికోపాన్ని అభినయిస్తూ, రోజూ చూస్తున్నదేగా – రోజూ చూసేదాన్ని గురించి వీళ్లెందుకింత గొడవ చేస్తారో అని అతను మరో గదిలోకెళ్లి సెలవుచీటి రాస్తూ చింపుతూ ఆఖరికి మేగ్నకార్టా తయారుచేసినంత తృప్తితో కడుపునొప్పిగా వుంది ఆఫీసుకు రాలేనని ఒకరోజు క్యాజుయల్లీ విమ్మని సెలవు పత్రం రాసి కిటికీతలుపు తెరిచి చూస్తూ వుంటాడు. చక్కని పెళ్లాన్నింట్లో వదిలేసి సైకిలు తొక్కుకుంటూ ఆఫీసుకెళ్లే చవటెవడైనా కనిపిస్తారేమోనని రోడ్డుమీద పడుచు పెళ్లాల వెచ్చని బాహుబంధాలనుంచి విడిపించి దూరంచేయటానికే యింటినుండి ఆఫీసుదాకా రోడ్డు వేశారేమో ననిపిస్తుందతగాడికి. ష్యూర్! ష్యూర్! ఇంటినుంచి ఆఫీసుకు రోడ్డు వేయించకూడదు. రిక్షాలంత యిరుగ్గా ఎందుకుంటాయంటే, పెళ్ళాంతో సర్దుకు కూర్చుని

మ్యాట్నీ సినిమా కెళ్ళడానికి వీలుగా అవి నిర్మించి వుండొచ్చు. రిక్షా నిర్మాతకు యువతీ యువకుల కష్టసుఖాలు బాగా తెలిపే పరుపులు మెత్తగా లోపల చీకటిగా కూర్చునేచోట్లు యిరుగ్గ వుండేట్లు రిక్షా నిర్మిస్తాడు. రిక్షాలో కూర్చున్న వారికి లోకవంటే రిక్షా తొక్కేవాడే - రిక్షావాలా లెప్పుడూ ముందుచూపు మనుష్యులు. వాళ్ళు వెనక్కి తిరిగి చూడకూడదు. పాపమో పుణ్యమో వెనక్కి తిరిగి చూడకుండా ప్రపంచ మార్గంగుండా పోతూవుంటారు. ఇంటినుంచి సినిమాహాల్స్‌కి వెళ్లే రోడ్డు. అన్ని రోడ్లలోకిది బెష్టు బెష్టున్నర. మనకిష్టం వున్నపుడు రోడ్డు మనకి ఫ్రెండులానూ మనకిష్టం లేనపుడు అదే రోడ్డు మనకి ఎగస్పార్టీలానూ కనిపించొచ్చు. ఒక్కే వస్తువు ఒకప్పుడోలాగా మరొకప్పుడు మరోలాగా కనిపించడాన్ని దొర్లు ఫినామినానో వల్లకాడో అంటారు. లోకంలోని వస్తువులన్నీ ఆయా పరిస్థితుల్ని బట్టి మారినట్టూ మారుతున్నట్టూ కనిపిస్తాయి.

రైలుబండి ప్రేమికులను, తల్లికూతుళ్ళను, స్నేహితుల్ని కలుపుతుంది. విడదీస్తుంది. పోస్టుమ్యాన్ తన సంచీలో మంచీ చెడ్డా నింపుకొని వస్తాడు. గాడిద మంచి గంధం పలకల్నీ, మాసిన బట్టల్నూ మోస్తుంది. లోకంలో అనుక్షణమూ ఏదో ఒకటి జరిగిపోతూ వుంటుంది. కిటికీమూసుకు కూర్చోడమా, తెరవడమా అనేది సమస్య. ఇది ఎవరికి వారే నిర్ణయించుకోవాలి.

ఆఫీసు నుంచి పూలపొట్లం మరియు గరం గరం పకోడీలు చేత్తో పట్టుకుని విజిల్ వేసుకుంటూ పాకెట్లో టెన్ రుపీస్ నోట్ గర గర మంటూండగా సైకిల్మీద యింటి కొస్తూంటే ఆ రోడ్ మనకు వసంతం పరిచిన పూలబాటలాగ అనిపిస్తుందనిపిస్తుంది. రోడ్డు వేసే కూలీలకు ఖరీదులేని చెమటోడ్చే అర్ధనగ్న మానవులకు రోలర్ లాగేప్పుడు అది వారి పాలిటికి అన్నదాత - మెతుక్కీ మెతుక్కీ మధ్యనున్న బరువు అది లాగేవారి నిట్టూర్పులలోంచి బయటపడుతూ వుంటుంది. మనకేమీ కాదు.

రోడ్డుమీద కాల్జారి పడ్డప్పుడు మనకు లోకం తలక్రిందులుగా కనిపిస్తుంది. దీన్నే జగత్సర్వం మాయ మిధ్య అని టెక్నికల్‌గా శంకరుడన్నాడు. అసలు నిజంగా అంతా మనం అనుకోవడంలో వుంది. ఒకే క్షణంలో ఒకరికేది నిప్పుల మంటవుతుందో మరొకరికది రంగు టద్దాల మేడ. ఇప్పుడు మన హీరో సెలవు సీటీ పంపిస్తున్నాడు. కడుపునొప్పి పేరెట్టి - అది ఆఫీసరుకు నిప్పుల మంట కావచ్చు, కాకపోవచ్చు. బాత్రూం లోంచి వచ్చి చీరకట్టుకుని మ్యాట్నీ షో సినిమాకు తయారవుతున్న కుల కాంతకు సెలవుచీటీ భర్త అరచేతిలో చూపిస్తున్న వైకుంఠం కావచ్చు, కాకపోవచ్చు. కూర తరుగుతున్న కులభామిని వెనుకకూర్చుని అతడామెకు జడ అల్లిపెట్టి తలలో పూలచెండు తురిమి ఘుమఘుమ లాడే ఆమె శిరము మూర్కొనవచ్చు. అప్పుడామె వెనుక బరువుకు తూలి కత్తిపీట మీదపడితే ప్రమాదం జరగవచ్చు. మ్యాట్నీకి వెళ్తుండగా వెనుకనుంచి లారీ వచ్చి గుద్ది దంపతులను క్షతగాత్రులను చేయవచ్చు, యమలోకానికి పంపనూవచ్చు.

ఇవ్వేం జరగలేదనుకోండి - మ్యాట్నీకి తయారవుతూండగా హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో ఆడపడుచూ అత్తగారూ ఆడపడుచు మొగుడూ పిల్లలూ రెండు రిక్షాల్లో దిగారనుకోండి. మళ్లీ అత్తెసరు పోయి కెక్కించడం, కూరలు తరగడం, పెద్దపందిరి మంచం గది ఆడబడుచు కివ్వడం చాపా జంబుఖానా పుచ్చుగుని యివతల వరండాలో నేలమీద దొర్లడం అంతా మామూలే. దంపతులిద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకోలేరు. దెబ్బలాడుకున్న వెంటనే చుట్టాలొస్తే బాగుంటుంది, కాని సంధి జరిగిపోయి ఒకరి కొకరు మరింత దగ్గరవుతున్న శుభవేళలో చుట్టాలొచ్చి అంతా పాడుచేస్తే, ఆ రాత్రి పున్నమైనా అమావాస్య అయినా వారి పాలిటికి అమృతం కురవనిరాత్రే!

# సంత(సం)

కొంతలో కొంత మనకీ వుండేది అవుట్‌డోర్ లైఫ్ - ఏమాట కా మాటే చెప్పుగోవాలి. సంతలూ, సంబరాలూ, తీర్థాలూ, వూరేగింపులూ వీటి మాటేవిటి?

“సంతకు చీటీ లచ్చికి గాజులు” అని వేళాకోళం చేస్తే చేశారు కాని, నాకు సంతకు వెళ్ళటం చిన్నప్పట్నుంచి చెడ్డ సరదా. నాకేవిటి పిల్లలందరికి సంత కెళ్ళడం అంటె కొద్దో గొప్పో తమాషాగా వుండేది. వెస్ట్ గోదావరిలో బెస్లు సంత గూడెం సంత, సంతసం అనేమాట కూడా సంతలోంచే పుట్టి వుండాలి. ఇప్పుడు టింగురంగామని, షోగ్గా, నైసుగా, లవ్‌లీగా ముస్తాబయి జంటలు జంటలుగా తుంటరిగా - ముద్దులేసి ముక్కారు నగలూ ధరించి మార్కెటింగ్‌కని యధాశక్తి కాల్నడకనూ, రిక్షాలమీద, బస్సులు-స్కూటర్లు,చిన్న కార్లమీద పోతూ వున్నారు కదా? యస్.యస్.పోతూ వున్నారు. ఇప్పుడు ఎక్కువ డబ్బు పట్టిగెళ్ళి తక్కువ సామాన్లు తెచ్చుగుంటున్నారు. అప్పుడు కొంచెం డబ్బుకి ఎక్కువ సామాన్లు తెచ్చుగునేవారు. వారంలో ఏదో ఒక రోజు వూళ్ళో సంత జరిగి తీరుతుంది. సంతరోజు మార్కెటింగ్ డే అని హాఫీసులూ స్కూళ్ళూ కూడా హాఫ్‌హాఫ్ పన్చేసేవి. హాఫ్ వర్కింగ్‌డే అంటే సంత శలవు. గూడెంలోనూ పాలకొల్లులోనూ శనివారం, మార్టేరులో మంగళ వారం, పెనుగొండలో బుధవారమూ యిట్లా సంతలు జరిగేవేమిటి నా మొహం - యిప్పుడు కూడా జరుగుతున్నాయి.

కమింగ్ టుది పాయింట్ సంత అంటే సరదా అని చెప్పాను కదా! సంత ఫిలాసఫీ కడు సంతసము గొల్పును. దూరాన్నుంచి గోలగా హడావిడిగా యమబిజీగా కనిపిస్తూ వుండే సంత అందులోకి మనం ఎంటరవగానే జీవుడు దేహంలోకి ప్రవేశించినట్లు అందలి సుఖదుఃఖములు మనకి అంటును. అంటవు.